# చదువు చెప్పు నాన్నా !

అరవై ఏళ్ళప్పుడు అమరయ్యకు సంధ్యా సమస్య వచ్చిపడింది. ఇద్దరే కొడుకులు. ఒకడు అమెరికాలో స్థిరపడ్డాడు. మరొకడు అంగలూరులో వ్యవసాయంచేసుకుంటూ, బ్రతుకుబండి నెట్టుకువస్తున్నాడు. టీచరుగా పదవీవిరమణచేసి రెండుసంవత్సరాలు అవుతుంది.

పల్లెటూళ్ళలో పనిచేసేరోజుల్లోనే పొదుపు పాటించి నాలుగురాళ్లు వెనకేసుకుని అంగలూరులో నాలుగుఎకరాల పొలం, పటమట లంకలో చిన్న ఇల్లు కట్టుకుని స్థిరపడినట్లే అనుకున్నాడు.

మగపిల్లలిద్దర్నీ ఒకే స్కూలు, ఒకే కాలేజీలో చదివించినా ఒక్కడికే చదువు అబ్బింది.

రెండోవాడు ఇంటర్‌లో చదువు మానేసి వ్యవసాయం మీద మక్కువ చూపించడంతో వాడి సంగతి పెద్దగా పట్టించుకోవడం మానేశాడు. పెద్దకొడుకుమీదే బాగా దృష్టిపెట్టాడు. ఎఫ్.ఆర్.సి.ఎస్. పరీక్షలకు పెద్దకొడుకును లండన్ పంపించాడు. పెద్ద డాక్టరయ్యాడు. కొన్నాళ్ళు లండన్‌లో పనిచేసేక అమెరికా వెళ్ళిపోయాడు.

ఇద్దరు కొడుకులకు పెళ్ళిళ్ళు అయ్యాయి. మనవళ్ళు, మనుమరాళ్ళు కూడా ఐదారు సంవత్సరాల వయస్సుకు వచ్చేశారు.

సాయంత్రంపూట ఇంటిముందు కుర్చీవేసుకుని పూలమొక్కలకేసి చూస్తూ కూర్చున్నాడు.

రోడ్డుమీద ఆటోలు, కార్లు, మోటర్‌సైకిళ్ళమోత, రోడ్డుమీద పోయేవాళ్ళ కేకలతో ప్రశాంతంగా కూర్చోలేకపోయాడు. తమ స్థలం కొనుక్కున్నప్పుడు లంకలో గులాబీ తోటలు

ఉండేవి. బెంజికంపెనీదాకా పొలాలు ఉండేవి. ఇప్పుడు ఎక్కడ చూసినా పెద్దపెద్ద అపార్టుమెంట్లు.

పూలతోటలతో, జున్ను గడ్డి పొలాలతో పచ్చగా ఉండే పడమటలంక ఇప్పుడు విజయవాడ సిటీలో అంతర్భాగం అయిపోయింది. భర్తకు టీకప్పు తెచ్చి ఇచ్చింది కమలమ్మ. తనూ ఓ కప్పు తెచ్చుకునిపూలమొక్కల మధ్య సిమెంటు దిమ్మమీద కూర్చుంది. అరగంటసేపు ఇద్దరూ మాట్లాడుకోకుండా కూర్చున్నారు.

మాట్లాడుకోకుండా కూర్చున్నారంటే వాళ్ళిద్దరి మధ్య పొరపొచ్చాలున్నాయని కాదు.

ఇద్దరూ చాలా అన్యోన్యంగానే ఉంటారు. అలా మౌనంగా కూర్చోవడం అలవాటు.

"అమెరికా వెళ్ళిపోదాం. పెద్దబ్బాయికి పర్మినెంటు రెసిడెన్సీ వచ్చింది. తల్లిదండ్రులు ఎన్నాళ్ళయినా అక్కడ ఉండొచ్చు!" అన్నాడు అమరయ్య.

కమలమ్మ మౌనంగా ఉండిపోయింది.

అంతకుముందోసారి కోడలు గర్భవతయినప్పుడు డెట్రాయిట్ వెళ్ళారు భార్యాభర్తలు. ఆరునెలలు అక్కడున్నారు. జైల్లోఉన్నట్లు అన్పించింది. అప్పుడప్పుడు వీకెండ్‌లో బయటకు తీసుకువెళ్ళేవారు. ఎక్కడకు వెళ్ళాలన్నా కార్లో వెళ్ళాల్సిందే! మాట్లాడుకోవడానికి చుట్టుప్రక్కల ఎవరూ ఉండరు.

కార్లు తప్పితే రోడ్లమీద జనం కన్పించరు. ఏమీ తోచనప్పుడు ఇక్కడ సంచిపట్టుకుని రైతు బజార్‌కో, దగ్గరున్న సెంటర్‌కు వెళితే బోలెడంత కాలక్షేపం.

ముక్కూ మొహం తెలియనివాళ్ళతో కూడా మాట్లాడొచ్చు. అక్కడ భాషా సమస్య. ఏ షాపింగ్‌మాల్‌కు వెళ్ళాలన్నా ఓ యాభై కిలోమీటర్ల దూరం కార్లో వెళ్ళాలి.

అన్న సౌకర్యాలూ వుంటాయి. అంట్లు తోముకునే పని వుండదు. ఇల్లు ఊడ్చే పని వుండదు.

కానీ ఏం లాభం? ఏం తోచదు! పరిచయం ఉన్న వాళ్ళింటికి వెళ్లి కాలక్షేపం చేద్దామన్నా పెద్దకొడుకు కార్లో తీసుకువెళ్ళాలి! వాళ్ళ పనుల్లో వాళ్ళు హడావుడిగా ఉంటారు. బయటకు తీసుకువెళ్ళమని అడగాలన్నా ఇబ్బందిగా ఉంటుంది. పెద్దకొడుకు గౌతమ్ ఎప్పుడూ చిటపటలాడుతూ ఉంటాడు. చిన్న చిన్న విషయాలక్కూడా కస్సుబుస్సుమంటాడు.

కమలమ్మకు ఆ ప్రవర్తన నచ్చదు.

"బాగా చదువుకున్నవాళ్ళు అంతేలే... మేధావులు అంతేలేవే... మీద పిడుగుపడ బోతున్నా చలించరుగాని వాళ్ళుపెట్టుకున్న స్థలంలో పెన్నుగాని, కళ్లజోడుగాని కన్పించక పోతే కంగారుపడిపోతారు" పెద్దకొడుకును సమర్థిస్తూ మాట్లాడేవాడు అమరయ్య.

"పెద్దాడు డాక్టరు... చివరిదశలో వాడిదగ్గర ఉంటేనే బాగుంటుంది.

ఎలాంటి అనారోగ్యసమస్యలు వచ్చినా వాడు చూసుకుంటాడు" అన్నాడు అమరయ్య.

వైద్యసౌకర్యాలు జీవితకాలాన్ని కొద్దిగా పొడిగించగల్గుతాయేగాని ఆసన్నమైన మరణాన్ని తప్పించలేవుగా! మనస్సుకు తృప్తిని, ప్రశాంతతను కలిగించేచోట ఉండాలి చరమాంకంలో' అనుకుంది కమలమ్మ.

వారంరోజుల్లో గౌతమ్ వస్తున్నాడుగా! నెలరోజులు ఇక్కడే ఉంటాడుగా! వాడు పిల్లలతో ఇక్కడకు వచ్చే సమయంలో చిన్నాడిని కూడా కోడల్నీ, పిల్లల్ని తీసుకురమ్మని ఫోన్లో గట్టిగా చెప్పండి. వాళ్ల ఏ నిర్ణయం తీసుకుంటే అలా చేద్దాం! అంగలూరైనా, అమెరికా అయినా నాకు ఒక్కటే!" అంది కమలమ్మ.

ట్రావెల్ ఏజెన్సీవాళ్ళ కారు మాట్లాడుకుని హైదరాబాద్ వెళ్ళాడు అమరయ్య. కొడుకును రిసీవ్ చేసుకోవడానికి.

"అమెరికా నుంచి వచ్చినవాడు కారు మాట్లాడుకుని విజయవాడ రాలేడా? మీరు శ్రమపడి ఇక్కడ నుంచి కారు తీసుకునివెళ్ళకపోతే!" అంది కమలమ్మ.

ఆమె మాటలు పట్టించుకోలేదు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టులో వియ్యంకుడు మాధవరావు కన్పించాడు. గౌతమ్ మామగారు పెద్ద కాంట్రాక్టర్. జూబ్లీహిల్స్‌లో రాజసౌధంలాంటి పెద్ద ఇల్లు ఉంది.

కొడుకు వస్తున్నాడన్న సంతోషంతో భోజనంకూడా చేయకుండా ఎయిర్‌పోర్టులో ఉండిపోయాడు అమరయ్య. వియ్యంకుడు భోజనం చేసి తాపీగా రాత్రి పన్నెండు గంటలకు వచ్చాడు.

ఫ్లయిట్ రెండు గంటలులేటు.

నెట్‌లో ఫ్లైట్ హైదరాబాద్ చేరుకునే సమయం చూసుకునే వచ్చాడు మాధవరావు. ఇమిగ్రేషన్ చెకింగ్ పూర్తయ్యి లగేజీ తీసుకుని గౌతమ్‌వాళ్ళు విజిటర్స్ లాంజ్‌కు చేరుకునే

సరికి ఒంటిగంట అయ్యింది. కొడుకును చూసి ఆనందంతో పొంగిపోయాడు అమరయ్య. కొడుకును వాటేసుకోవాలన్న బలమైన కోరిక కలిగింది. కొడుకు దగ్గరకు వెళ్ళేసరికి గౌతమ్ మామగారు అడొచ్చి అల్లుడిని హృదయానికి హత్తుకున్నాడు.

తండ్రివైపు చూసి చిన్న చిరునవ్వు విసిరేసి ఇంగ్లీష్‌లో మామగారితో ఐదునిముషాలు మాట్లాడుతూ వుండిపోయాడు గౌతమ్.

"అల్లుడుగారు మా ఇంటికి వస్తున్నారు. మీరూ మా ఇంటికి వచ్చి రెండ్రోజులు ఉండి వెళ్ళండి" అన్నాడు మాధవరావు, అమరయ్యతో.

వియ్యంకుడి మాటలు అమరయ్యను కలవరపెట్టాయి. "ఏరా నాన్నా! నాతోపాటు విజయవాడ రావడంలేదా? మీ అమ్మ నీ కోసం ఎదురుచూస్తూ వుంది. నువ్వు విజయవాడ వస్తానని ఫోన్లో చెబితేనే గదా నేను కారు మాట్లాడుకుని ఇడకు వచ్చింది" అన్నాడు అమరయ్య చెమర్చిన కళ్ళతో.

"విజయవాడలో మన ఇల్లు అంత కంఫర్టబుల్‌గా ఉండదు. మామగారింట్లో ఇరవై రోజులు ఉండి విజయవాడ వస్తాను. అమెరికా వెళ్ళబోయేముందు ఓ వారం రోజులు మనింట్లో ఉంటాను. హల్లో చిల్డ్రన్! గివ్ ఎ హగ్ టు గ్రాండ్‌ఫాదర్" అన్నాడు గౌతమ్.

మనవడు, మనవరాలు వచ్చి అమరయ్యను వాటేసుకున్నారు రెండు క్షణాలు. ఆ ఆనందం ఆస్వాదించే లోపే "కారు రెడీగా ఉంది. వెళ్దాం పదండి!" అన్నాడు మాధవరావు కూతురు, అల్లుడితో.

లగేజీ ట్రాలీని నెట్టుకుంటూ పార్కింగ్ ప్లాట్‌వైపు వెళ్తున్న కొడుకు, కోడలి వెనుక మొహం వేలాడేసుకుని నీరసంగా నడుస్తూ వెళ్ళాడు అమరయ్య. "మరి నన్నెందుకు రమ్మన్నావ్ ఇక్కడకు?" కొడుకును అడిగాడు అమరయ్య.

"మామగారికి అర్జెంటు పనులుండి ఎయిర్‌పోర్టుకు రాలేకపోతే మీ కారు 'స్టాండ్‌బై'గా ఉంటుందని మిమ్మల్ని రమ్మన్నాను" అన్నాడు గౌతమ్.

మనస్సు చివుక్కుమంది.

తండ్రి బాధపడుతున్నాడని గ్రహించాడు గౌతమ్. తండ్రి భుజంమీద చెయ్యివేసి 'టేకిట్ ఈజీ...డాడీ" అన్నాడు తండ్రిని దగ్గరకు తీసుకుంటూ.

కొడుకు ఆ కాస్త ప్రేమ చూపించినందుకే కరిగిపోయాడు. అద్దెకు తెచ్చుకున్న కారులోనే విజయవాడ తిరిగి వచ్చేశాడు. వియ్యంకుడి ఇంటికి వెళ్ళకుండా.

ఇంటికొచ్చాక భార్యముందు గుండెల్లో గూడుకట్టుకున్న బాధని వెళ్లగక్కుకున్నాడు అమరయ్య.

సమదాయించింది కమలమ్మ.

"వాళ్లు ఇక్కడకు రాకుండా హైదరాబాద్‌లోనే ఉండిపోయారని నీకేం బాధ కలగడంలేదా?" భార్యను అడిగాడు అమరయ్య.

"తల్లిదండ్రులు పెద్దవాళ్ళయ్యారు. వాళ్లను చూడాలని పిల్లలు పరితపించాలిగానీ, అన్నీ సర్దుకుని అందరికీ వీడ్కోలు చెప్పి వెళ్ళిపోయే స్థితిలో వున్న మనం పిల్లలు మనల్ని ఎప్పుడూ అంటిపెట్టుకుని వుండాలని కోరుకోకూడదు. పిల్లలమీద ఆరాటం తగ్గించుకుని అన్ని బంధాలకు దూరంగా ఉండే ప్రయత్నం చేయాలి" అంది కమలమ్మ.

భార్యవైపు రెప్పలార్పకుండా చూస్తూండిపోయాడు. అదే సమయంలో చిన్నకొడుకు, కోడలు, మనవళ్ళు ఆటో దిగి ఇంట్లోకి వచ్చేశారు.

అరటికాయల గెల, జున్నుపాలు వున్న స్టీల్‌క్యాన్, అరిశెలు, చక్కిరాలు ఉంచిన క్యాన్‌లు ఇంట్లో సర్దుతున్నాడు చిన్నకొడుకు నరేంద్ర.

"రెండు ఆటోల్లో రాకపోయారా! ఇరుకుని ఒక్క ఆటోలే రాకపోతే!" అన్నాడు అమరయ్య.

వసుమతి వచ్చి అత్తమామల పాదాలకు నమస్కరించింది. ఇద్దరు మనవళ్ళు తాతగారికి చెరొక పక్కగా చేరి అతుక్కుపోయి కూర్చున్నారు సోఫాలో.

పెద్ద మనవడి పేరు మణిదీప్.

రెండోవాడి పేరు రవీంద్ర.

"తేజ, నిత్య రాలేదా తాతయ్యా?" పెదనాన్నగారి పిల్లల గురించి అడిగాడు మణిదీప్.

అమెరికాలో ఉండే పిల్లల పేర్లు పిళ్ళకు గుర్తున్నాయి. గౌతమ్ పిల్లలకు వీళ్ళ పేర్లు తెలుసో లేదో!" అనుకున్నాడు అమరయ్య.

"మీకు ఇష్టమని మీ కోడలు అరిశెలు చేసుకుని తీసుకువచ్చింది" అరిశెలు ఉన్న ప్లేటు భర్తకు ఇస్తూ అంది కమలమ్మ. "పిల్లలు ఎప్పుడు తిన్నారో ఏమో! వంట ప్రయత్నాలు మొదలుపెట్టకపోయావా!" కమ్మలవైపు చూస్తూ అన్నాడు అమరయ్య.

చిన్న కొడుకు, మనవళ్ళు,కోడలు ఇంట్లో తిరుగుతూ వుంటే ఆమె కళ్లు ఆనందంతో మెరిసిపోతున్నాయి. "వంట కోడలే చేస్తుందట. తను ఇక్కడ ఉన్నన్నాళ్ళు వంటగది ఛాయలకే నన్ను రావద్దంది మీ కోడలు" నవ్వుతూ అంది కమలమ్మ.

స్నానంచేసివచ్చి తండ్రిపక్కన కూర్చున్నాడు నరేంద్ర. "ఎలా ఉందిరా నీ వ్యవసాయం? మీ తాత జోగయ్యకు నీకు మల్లే వ్యవసాయం అంటే మహాపిచ్చి. ఏ పంట వేసినా ఊళ్ళో అందరికంటే ఎక్కువ పండించేవాడు. వయస్సులో వున్నరోజుల్లో మినుములు బస్తా అవలీలగా మోసేవాడట.

పుటకగల ఎద్దుల్ని మేసేవాడు. ఇంటిముందు పశువుల సావిడి ఉండేది. పాడి పశువులుండేవి.

చుట్టుపక్కల ఎక్కడ ఎడ్లపందాలు జరిగినా మీ తాత ఎడ్లను అక్కడకు తీసుకు వెళ్ళేవాడు. ఎడ్పలందాలతో గెలిచేక ఎద్దుల్ని గ్రామంలో ఊరేగించేవాడు' పాతసంగతులు చెప్పుకుపోయాడు అమరయ్య.

"అవన్నీ పాతముచ్చట్లు నాన్నా! రైతులిప్పుడు పొలం పనులు మానుకుని పొలం కౌలుకు ఇస్తున్నారు. దగ్గర్లో వున్న పట్టణాలకు, టౌన్లలో కాపురం పెట్టి పిల్లల్ని చదివించుకుంటున్నారు.

సొంతంగా వ్యవసాయం చేసుకుంటే గిట్టుబాటు కావడంలేదు. వ్యవసాయ ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి. మగతాకి పొలం తీసుకుని వ్యవసాయం చేస్తున్నా చివరకు అప్పులు మిగులుతున్నాయి.

పొలాలమీద పెట్టుబడి ఎక్కువ పెట్టాల్సి వస్తున్నది. అప్పులు పెరిగిపోతున్నాయి.

ఇప్పుడు ఎడ్లను ఎవరు భరిస్తున్నారు? పశువుల మేతకోసం జనుము, పిల్లిపెసర వేసేవాళ్ళు వెనుకటి రోజుల్లో.... ఇప్పుడు జనుము వెయ్యడమే మానేశారు" వ్యవసాయదారుల ఇబ్బందులు ఏకరువు పెట్టాడు.

"నువ్వేమన్నా అప్పులుచేశావా?" ఆదుర్దా నిండిన గొంతుతో అడిగాడు అమరయ్య.

"ఆదాయంలేదు.... అప్పుల్లేవ్... అర ఎకరం కొన్నది లేదు అర ఎకరం అమ్మలేదు... ఉన్న పొలంతోపాటు నాలుగైదు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం సాగిస్తున్నా" అన్నాడు నరేంద్ర.

పిల్లలిద్దరూ తాతను వదలడంలేదు. ప్రతిక్షణం ఏదోక విషయం గురించి ప్రశ్నలు వేస్తూనే వున్నారు వాళ్ళు. ఓపిగ్గా సమాధానాలు ఇస్తున్నాడు అమరయ్య. గలగలా పిల్లలు మాట్లాడే మాటలు, చలాకీగా ఇంటిచుట్టూ తిరుగుతూ ఆడే ఆటలు అమరయ్యకు, కమలమ్మకు అపరిమితమైన ఆనందం కల్గిస్తున్నాయి.

పక్కన కొడుకు, కోడలు లేనప్పుడు భార్యతో ఓ మాట అన్నాడు అమరయ్య.

"మనింట్లో మనవళ్లు ఎన్ని రోజులుంటారే? ఓ నెలరోజులు మనల్ని మురిపించి మళ్ళీ అంగలూరు వెళ్ళిపోతారు. మళ్ళీ దిగులు, విచారం మనమీద దండయాత్ర చేస్తాయి. అందుకే వాళ్ళతో ఎక్కువగా చనువుగా ఉండకు, మమతలు పెంచుకుని ఆ తరువాత తుంచుకోవాలంటే ఇబ్బంది" అనేశాడు అమరయ్య.

"వాళ్ళెక్కడో వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నట్లు మాట్లాడతారేం? అంగలూరు ఎంతదూరం? నాలుగు అంగలు వేస్తే చేరుకుంటాం....

మీకు ఎటూ ఉద్యోగ బాధ్యతలు లేవు... ఉండాలనుకుంటే వాళ్ళ దగ్గరే వుంటాం! చివరి రోజుల్లో వాళ్ళతోపాటు మనం ఆడుకుంటూ వాళ్ళ అల్లరితో భాగస్వాములం కావాలి!" అందామె.

మౌనంగా వుండిపోయాడు.

ఆ రోజు రాత్రి అమరయ్య పక్కలో చేరేరు ఇద్దరు మనవళ్ళు. "మాకో కథ చెప్పు తాతయ్యా? నువ్వు కథలు కూడా రాస్తావటగా మా నాన్న చెప్పాడు" అన్నాడు మణిదీప్.

"నాగులాపురం అనే ఊళ్ళో ఓ పెద్దాయన వున్నాడు. ఆయనకు ఇద్దరు కొడుకులు. పెద్దకొడుక్కి బాగా చదువుకున్నాననే గర్వం, అతిశయం ఎక్కువ. చిన్న కొడుకు అమాయకుడు. పెద్దగా చదువుకోకపోయినా లోకజ్ఞానం వుంది.

ఇద్దరికీ ఓ పరీక్ష పెడతానన్నాడు ముసలాయన.

సరేనన్నారు కొడుకులు.

మీకు చెరొక వెయ్యి వెండి రూపాయలు ఇస్తాను. ఎవరు వాటితో ఇల్లంతా నింపేస్తారో వారికే నా ఆస్తి దక్కుతుందంటాడు.

పెద్దకొడుకు వెంటనే బజారుకు వెళ్ళి బల్లలు, బీరువాలు, మంచాలు కొనితెచ్చి ఇంట్లో చేరుస్తాడు.

వెయ్యిరూపాయలతో వస్తువులుకొన్నా ఇంటిలో చాలాభాగం ఖాళీగా మిగిలి పోతుంది.

చిన్నకొడుకు ఓ దీపం కొనుక్కుని తెచ్చి ఇంట్లో వుంచి వెలిగిస్తాడు. ఆ దీపకాంతి ఇల్లంతా నిండిపోతుంది. దీనినిబట్టి మీకేం అర్థం అవుతుంది?" కథ చెప్పేక మనవళ్ళని అడిగాడు.

"చదువుకున్నవాడికంటే లోకజ్ఞానం ఉన్నవాడే గొప్ప... నలుగురికి వెలుగును ఇచ్చేవాడే గొప్ప" అని అన్నాడు మణిదీప్.

"నువ్వు ఘటికుడివేరా!" అన్నాడు అమరయ్య మనవడి తల నిమురుతూ.

అమెరికా వెళ్ళబోయేముందు పిల్లల్ని, భార్యను తీసుకువచ్చాడు అమరయ్య పెద్దకొడుకు.

వాళ్లు వచ్చినరోజునే అంగలూరి నుంచి ఓపెద్దాయన కూతుర్ని తీసుకువచ్చాడు.

ఆ అమ్మాయి విజయవాడలో పరీక్షలు రాయటానికి వచ్చింది. ఆ వచ్చినవాళ్ళు ఇంట్లో కలివిడిగా తిరగడం నచ్చలేదు గౌతమ్‌కి.

"వీళ్ళనెవరు రమ్మన్నారు?"

"నేం రమ్మన్నానులే అన్నయ్యా! వాళ్లు మా పక్క ఇంట్లో వుంటారు. మన ఇంటి అడ్రస్ నేనే ఇచ్చాను" అన్నాడు నరేంద్ర.

అడ్డమైన ప్రతివాడిని ఇంటికి రమ్మని చెప్పకూడదు... వాళ్ళకు నువ్వు సహాయం చేయదల్చుకుంటే హోటల్లో ఓ రూమ్ బుక్‌చెయ్యి. హోటల్లో వుంచే ఏర్పాటు చెయ్యాలిగాని, ఇంటికి రమ్మని చెబితే ఎలా? ఎంత ఇబ్బంది? అదే అమెరికాలో అయితే తల్లిదండ్రులను పిలిచినా వాళ్లు ఉండటానికి హోటల్లో ఎకామిడేషన్ ఏర్పాటుచేస్తారు. ఫాదర్స్‌డే, బర్త్‌డే- అలాంటి ప్రత్యేక సందర్భాలలో పిలిచి అన్ని సౌకర్యాలున్న హోటల్లో ఉంచుతారు. ఇంటికి తీసుకువచ్చి నెత్తిమీద పెట్టుకోరు" లెక్చర్ దంచేశాడు గౌతమ్.

పెద్దకొడుకు మాటలకు నివ్వెరపోయాడు అమరయ్య. రేపు తను అమెరికా వెళ్ళినా అదే తరహా మర్యాదలు చేస్తాడేమో! మరుసటిరోజు మరోసారి నివ్వెరపోయేలా చేశాడు పెద్దకొడుకు.

"మన ఇంటిపక్కన వున్నవాళ్ళు ఇల్లు అమ్ముతారేమో కనుక్కోండి డాడీ!

మన స్థలం, ఆ ఇంటిస్థలం కలిపి ఇక్కడ పెద్ద అపార్టుమెంట్ కట్టొచ్చు... మా మామగారు పెట్టుబడి పెడతాడు" అన్నాడు.

"మన ఇల్లు పడగొట్టి అపార్టుమెంట్ కట్టుకోవడానికి నా మనస్సు ఒప్పుకోదుగాని ఆ టాపిక్ ఒదిలెయ్యి" అన్నాడు అమరయ్య గౌతమ్‌తో.

ముందు వారంరోజులు అన్నాడుగాని, విజయవాడలో నాలుగురోజులే వున్నాడు గౌతమ్. పెద్దకొడుక్కి సెండాఫ్ ఇవ్వడానికి హైదరాబాద్ వెళ్ళలేదు అమరయ్య.

తిరిగి వెళ్ళబోయే రోజు తండ్రి చేతిలో ఓ కవరు ఉంచాడు నరేంద్ర.

ఏదో ముఖ్యమైన విషయం అయివుంటుందనుకుంటూ కవర్లోని కాగితాలు బయటకు తీశాడు అమరయ్య. అవి మణిదీప్, రవీంద్రల స్కూల్ ట్రాన్స్ఫర్ సర్టిఫికెట్స్.

"పిల్లల టిసిలు ఎందుకు తీసుకున్నావ్? గుడివాడలో మంచి స్కూల్లోనే చదువుతున్నారుగా!" చిన్నకొడుకును అడిగాడు.

"పిల్లలిద్దరినీ మీ దగ్గర ఉంచుతాను. ఇక్కడే మంచి స్కూల్లో చేర్పించండి... స్కూల్లో భాషాజ్ఞానం, శాస్త్రజ్ఞానం నేర్పితే మీరు మనవళ్ళకి మన సంస్కృతీ సంప్రదాయాలు, మానవ విలువల గురించి నేర్పాలి. మీ దగ్గర పిల్లలు పెరిగితే వారిలో మానసిక వికాసం వుంటుంది. మీ జీవిత అనుభవం వారికి ఉపయోగపడుతుంది. మీకు అరవైయ్యేళ్ళు! అదేం పెద్ద వయస్సు కాదు. చక్కటి ఆరోగ్యం వుంది మీకు. అమ్మకు... పెద్దకొడుకు దగ్గరో చిన్నకొడుకు దగ్గరో ఉండాలనే ఆలోచన ఇప్పుడు పెట్టుకోకండి. మరీ వయోవృద్ధులైనప్పుడు మా దగ్గర ఉందురుగాని" చెప్పుకుపోయాడు నరేంద్ర.

ఆ మాటలు విన్న అమరయ్య కమలమ్మలకు ఆనందం అంబరాన్ని తాకినట్లయింది.

"పిల్లలకు మీరు చెప్పే చదువే ముఖ్యం!" అంటూ ముగించాడు నరేంద్ర.

ప్రేమగా కొడుకు తలనిమిరేడు అమరయ్య.

**- స్వాతి, 26-07-2013**